సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 18 । జూన్ । 2024





సంగారెడ్డి: హౌసింగ్ బోర్డు సమీపంలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయం నుంచే మసీదులు, ఈద్గాల వద్దకు ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంగారెడ్డితోపాటు అన్ని మండలాల్లోని మసీదులలో నమాజు నిర్వహించారు.

- సంగారెడ్డి టౌన్/ సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

కేతకీలో మెదక్ జడ్జి పూజలు



ఆలయంలో జడ్జి అర్జున్

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో మెద్చల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.అర్జున్ ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు పూర్ణకుంభంతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులకు కుంకుమార్చన, అభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, సుభాష్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: మనూరు మండలం పుల్‌కుర్తి గ్రామంలో సోమవారం ఊరడమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసనం, ఉత్విక్ వర్ణనం, అంకురారోహణం, నవగ్రహ వాస్తు, హావనం, హారతి, బోనాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎంపీ సురేశ్ షెట్కార్ పాల్గొని పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రషీద్, సంగమేష్ పటేల్, సంతోష్ పటేల్, సంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖేడ్ చిత్రకారుడికి అరుదైన గౌరవం



శివకుమార్

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. రావి ఆకులపై ఇప్పటి వరకు దేశంలోని ప్రముఖులు, వివిధ అంశాలకు సంబంధించి 1,005 చిత్రాలను పొందుపరిచిన ఆయనకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులోకి ఎక్కాడు. సోమవారం దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను శివకుమార్‌కు పంపించారు.

ప్రారంభోత్సవానికి రండి



ఎంపీ రఘునందన్ రావుకు మొక్కను అందిస్తున్న మాజీ సర్పంచ్ సోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : మెదక్ ఎంపీ రఘునందన్ రావును సోమవారం ఆయన నివాసంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 21వ తేదీన జరుగనున్న నూతన తెల్లాపూర్ మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

పరిహారం తేల్చకుండానే..

పాసుబుక్కులు తీసుకుంటున్నారు

- అధికారుల తీరుపై నిర్వాసితుల్లో విస్మయం
- రీజినల్ రింగ్‌రోడ్డు భూసేకరణ ప్రక్రియ తీరుపై విమర్శలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియ విషయంలో అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లించనున్న పరిహారం ఎంతో తేల్చకుండానే రైతుల నుంచి ఆయా భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియను చేపట్టారు. ఈ భూములకు సంబంధించి అవార్డు ప్రకటించారు. ప్రస్తుతం ఈ ప్యాకేజీపై ఎంక్వయిరీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం నిర్వాసితులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నర్సాపూర్, కొడిపల్లి మండలాల పరిధిలోని నిర్వాసితులతో నర్సాపూర్‌లో రెవెన్యూ అధికారులు సమావేశమయ్యారు. ఈ ప్యాకేజీలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుసుకునేందుకు సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇందులో రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎకరానికి ఎంత మొత్తంలో పరిహారం చెల్లిస్తారో తేల్చకుండానే పాసుపుస్తకాలు తీసుకోవడం ఏమిటని నిర్వాసితులు వాపోతున్నారు. తరతరాలుగా ఈ భూములనే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న తమ నుంచి వీటిని లాక్కోవద్దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ చుట్టూ..

హైదరాబాద్ చుట్టూ మొత్తం 348 కి.మీల పొడవున రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణానికి సుమారు 10 వేల ఎకరాల భూసేకరణ అవసరమని అంచనా వేశారు. ఉత్తర భాగం 158 కి.మీల పొడవున రోడ్డు కోసం సుమారు 4,600 ఎకరాలు, దక్షిణ భాగం 189 కి.మీల రోడ్డు కోసం సుమారు 5,400 ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. భూసేకరణకు అయ్యే ఖర్చుపై ఇప్పటికే అధికారులు అంచనాకు వచ్చారు.

బేసిక్ విలువ, రిజిస్ట్రేషన్ లావాదేవీల ఆధారంగా రేటు నిర్ణయం

ఈ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలనే డిమాండ్‌లు తెరపైకి వస్తున్నాయి. నివాసిత ప్రాంతాల మీదుగా ఈ రహదారి అలైన్‌మెంట్‌లు ఉండటంతో తమ ఇండ్లు పోయి నిరాశ్రయులు అయ్యే పరిస్థితి నెలకొందని నిర్వాసిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో అవార్డు ఎంక్వయిరీ పేరుతో నిర్వహిస్తున్న సమావేశాల్లో నిర్వాసితులతో అధికారులు సంతకాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అలైన్‌మెంట్‌ను మార్చాలని, లేని పక్షంలో మార్కెట్ రేటు ప్రకారం తమ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం పరిహారం చెల్లిస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు. భూమి బేసిక్ విలువ, రిజిస్ట్రేషన్ ట్రాంజక్షన్ విలువలను ఆధారంగా పరిహారం రేటు నిర్ణయిస్తారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ లెక్కన పరిహారం చెల్లిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని నిర్వాసితులు వాపోతున్నారు.

జిరాక్సులే తీసుకుంటున్నాం

రీజినల్ రింగురోడ్డు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అవార్డ్ ఎంక్వయిరీ కోసం నిర్వాసితులతో సమావేశం నిర్వహించాం. అయితే నిర్వాసితుల వద్ద పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకోవడం లేదు. కేవలం వాటి జిరాక్సులే తీసుకుంటున్నాం. పరిహారం రేటు ఇంకా నిర్ణయం కాలేదు. భూమి బేసిక్ విలువ, రిజిస్ట్రేషన్ ట్రాంజక్షన్‌ల ఆధారంగా రేటు నిర్ణయిస్తాం. దీనిపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకుంటే అక్కడ పరిహారం పెంచేందుకు వీలుంటుంది.

– జగదీశ్వర్‌రెడ్డి, నర్సాపూర్ ఆర్డీఓ

21 నుంచి గ్రామాల్లో పర్యటిస్తా

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- 24న జాబ్ మేళా
- అర్హతల మేరకు ఉద్యోగాలు
- నిరుద్యోగులు తరలిరావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: 'పట్టణంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నాం. అర్హతల మేరకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తాం. నిరుద్యోగులు తరలిరావాలి. అలాగే ఈ నెల 21 నుంచి గ్రామాల్లో పర్యటిస్తా'నని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మండల నేతలతో సమావేశం నిర్వహించారు. అలాగే ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యవసాయ సంబంధిత ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ అంతరాయం, తాగునీటి ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, వ్యవసాయ తదితర సమస్యలు ఉన్నా తనకు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అత్యవసర సమస్యలు ముందుగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 21 నుంచి గ్రామాల్లో పర్యటిస్తానని మంత్రి తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చందు, నాయకులు జైపాల్ రెడ్డి, రాజు ఉన్నారు.

యువతకు స్ఫూర్తి

హుస్నాబాద్: కరీంనగర్ జిల్లాలో ఎన్‌వైకే కో ఆర్డినేటర్‌గా రామారావు యువతకు దిశానిర్దేశం చేసి నాయకత్వ లక్షణాలను పెంపొందించారని మంత్రి పొన్నం అన్నారు. హుస్నాబాద్ స్ఫూర్తి అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం పూర్వ నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ రామారావు శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రామారావు లాంటి వ్యక్తులు వేలలో ఒకరున్నా సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షరస్వీకారాల సందడి



అమ్మవారి సన్నిధిలో చిన్నారుల అక్షరస్వీకారాలు

వర్గల్(గజ్వేల్): సరస్వతి మాత కొలువైన వర్గల్ క్షేత్రం సోమవారం చిన్నారుల అక్షరస్వీకారాలతో సందడిగా మారింది. సెలవురోజు కావడంతో అమ్మవారి సన్నిధిలో అక్షరాలు దిద్దించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తల్లి దండ్రులు తమ చిన్నారులతో క్షేత్రానికి తరలి వచ్చారు. ఆలయ మండపంలో ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా సరస్వతి పూజ, అక్షరస్వీకారాలు జరిపించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 400 పైగా అక్షరస్వీకారాలు జరిగినట్లు ఆలయ మేనేజర్ రఘుపవన్ తెలిపారు.

చౌట్కూర్‌లో క్లినిక్ సీజ్



క్లినిక్‌ను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి : మండల పరిధి చౌట్కూర్‌లోని లక్ష్మీ వినాయక ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ గాయత్రీ దేవి ఆదేశానుసారం పుల్కల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయికిరణ్ సోమవారం సీజ్ చేశారు. వెంకటేశం తన పరిధికి మించి వైద్యం చేసి బైరి మల్లేశం మరణానికి కారణం అయినందున క్లినిక్‌ను మూసివేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు.

మెదక్ బంద్ సంపూర్ణం



రామాయంపేట: మూతపడిన దుకాణాలు

మెదక్‌జోన్: బీజేపీ, దాని అనుబంధ సంఘాలు ఇచ్చిన జిల్లా బంద్ సోమవారం సంపూర్ణమైంది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. చేగుంట, రామాయంపేట, చిన్నశంకరంపేట, వెల్దుర్తి, తూప్రాన్, నార్సింగి, కౌడిపల్లి, హవేళిఘణాపూర్, పాపన్నపేట మండలాల్లో బంద్ పాటించారు. పోలీసులు ఒకే వర్గానికి మద్దతు ఇస్తున్నారని బీజేపీ, వీహెచ్‌పీ, గోరక్షణ సమితి సభ్యులు పలు చోట్ల నిరసన తెలిపారు.

21కి చేరిన అరెస్టుల సంఖ్య

పోలీసులు ఒకే వర్గం వారిని అరెస్టు చేశారని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను పోలీసులు ఆలస్యంగా పసిగట్టారు. ఆదివారం ఐజీ రంగనాథ్ మెదక్‌లో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దని చెప్పారు. శనివారం రాత్రి బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు మొత్తం 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు ఆదివారం రాత్రి మరో నలుగురు బీజేవైఎం, గోసంరక్షణ సభ్యులను అరెస్టు చేశారు. అలాగే 8 మంది ముస్లిం వర్గానికి చెందిన వారిని అరెస్ట్ చేశారు. దీంతో మొత్తం అరెస్టుల సంఖ్య 21కి చేరుకుంది. ఇరువర్గాల సభ్యులను ఒకేసారి అరెస్ట్ చేసి ఉంటే సోమవారం జిల్లా బంద్ జరిగేది కాదని పలువురు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

భారీగా పోలీసుల మోహరింపు

బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా కేంద్రంలో పోలీసులను భారీగా మోహరించారు. దర్గాలు, ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఆదివారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన నల్లపోచమ్మ బోనాల ఊరేగింపు సైతం ప్రశాంతంగా జరగడంతో పోలీస్ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

హై వేగంగా పనులు

- చకచకా రహదారి విస్తరణ
- నిజాంపేట్– నారాయణఖేడ్– బీదర్ 161బీ పనులు షురూ
- రూ.513 కోట్లు విడుదల
- మెరుగుపడనున్న రవాణా
- తగ్గనున్న దూరభారం



నారాయణఖేడ్: చాల్కి సమీపంలో నిర్మాణంలో ఉన్న రహదారి

నారాయణఖేడ్: రవాణాపరంగా పడుతున్న ఇబ్బందులు ఇకపై తొలగిపోనున్నాయి. నిజాంపేట్– నారాయణఖేడ్– బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలయ్యాయి. ఖేడ్ నుంచి బీదర్‌కు అధ్వానంగా మారిన రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. కర్ణాటక– తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ ఉన్న ఈ రహదారి నిర్మాణం వల్ల రవాణా పరంగానే కాకుండా వైద్యం, వ్యాపారం, వాణిజ్యం తదితర రంగాల అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. దాదాపు పదిహేనేళ్ల క్రితం నిజాంపేట్– నారాయణఖేడ్– బీదర్ జాతీయ రహదారిగా గుర్తిస్తూ విస్తరణకు రోడ్ నంబరు 50గా కేటాయించారు. మొదటి సారిగా ఎంపీగా గెలిచిన సురేశ్ షెట్కార్ అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఈ రోడ్డు నిర్మాణం, జాతీయ రహదారి గుర్తింపునకు కృషి చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారడంతో రహదారి పనుల గురించి ఎవరూ పట్టించుకోలేదు. నాందేడ్– అకోలా రహదారికి అనుసంధానంగా ఉండడంతో ఈ రహదారికి 161బీగా మార్చారు. తిరిగి మళ్లీ రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖత వ్యక్తం చేయగా పనులు ప్రారంభమయ్యాయి.

రూ.513కోట్లు విడుదల

జిల్లా మీదుగా సాగే సంగారెడ్డి– నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నారాయణఖేడ్ సమీపంలోని మండల కేంద్రమైన నిజాంపేట్ నుంచి ఖేడ్, మనూరు, న్యాల్‌కల్ మండల కేంద్రాల మీదుగా బీదర్ పట్టణానికి రహదారి నిర్మాణం సాగుతోంది. ప్రస్తుతం ఈ రహదారి అధ్వానంగా మారి సింగిల్ లేన్‌గా ఉంది. 45కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు విస్తరణకు గాను ప్రభుత్వం రూ.513కోట్లను విడుదల చేసింది. రోడ్డు నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం, భూ సేకరణ కోసం అదనంగా మరో రూ.28 కోట్ల నిధులు విడుదల చేసింది.


తగ్గనున్న దూరభారం

రహదారి నిర్మాణం పూర్తయితే దూరభారం తగ్గనుంది. ప్రస్తుతం 55 కిలోమీటర్ల మేర రహదారి అవుతుంది. విస్తరణ, మలుపుల తగ్గింపు వల్ల సుమారు పది కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా నిజాంపేట్ నుంచి ఖేడ్ వరకు అత్యంత ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మలుపులు తగ్గించి నేరుగా నిర్మాణం చేయనున్నారు. ఖేడ్ నుంచి బీదర్ వరకు ఉన్న మలుపులు కూడా తగ్గనున్నాయి. ఈ రహదారిని రెండు వరుసలుగా నిర్మిస్తున్నారు.

రవాణా సదుపాయం మెరుగు

రహదారి నిర్మాణంతో రవాణా పరంగా ఉన్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఖేడ్ ప్రాంత వాసులు పట్టణ ప్రాంతానికి వెళ్లాలంటే 80కిలోమీటర్ల దూరంలోని సంగారెడ్డి లేదా, 150 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్‌కు వెళుతుంటారు. ఈ రహదారి పూర్తయితే 45కిలోమీటర్ల దూరంలో ఉండే బీదర్ పట్టణానికి వెళ్లి రావడం సులువుగా ఉంటుంది. వ్యాపారం, వాణిజ్యం, కొనుగోళ్లు, విక్రయాలు, ఆస్పత్రులు తదితర రంగాల పరంగా బీదర్‌కు రాకపోకలు పెరుగుతాయి. బీదర్ నుంచి రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ఖేడ్ పట్టణ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో ఉన్న భారీ వృక్షాల తొలగింపు పనులు సైతం చేపట్టారు.

తగ్గేదేలే.. సెంచరీ కొట్టిన టమాటా



నిత్యావసరాల్లో ఒకటైన టమాటా ధరకు రెక్కలొచ్చాయి. నిన్న మొన్నటి వరకు కేజీ రూ.10, రూ.20 ఉన్న ధర ఒక్కసారిగా ఏకంగా సెంచరీ కొట్టేసింది. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో జరిగిన వారాంతపు సంతలో కేజీ టమాట ధర రూ.100 పలికింది. కొనుగోలుదారులు ఈ ధరను చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రెండు నెలల క్రితం కనీస ధర లేక టమాటాలను రోడ్డు పక్కన కుప్పలుగా పారబోశారు. ఇప్పుడు ఇంత ప్రియం కావడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు.

ఝరాసంగం(జహీరాబాద్):

పదునెక్కిన పొలం.. సాళ్లల్లో విత్తనం



బాన్సువాడ గ్రామ శివారులో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు

మృగశిర కార్తెలో కురిసిన వర్షాలకు పొలాలు పదునెక్కాయి. దీంతో రైతులు వ్యవసాయం పనుల్లో బిజీబిజీ అయ్యారు. విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకొని పొలంబాట పట్టారు. కంగ్టి మండలంలో ఆరుతడి, వర్షాధార పంటలు అధికంగా సాగుచేస్తారు. నేల అనుకూలంగా ఉండటంతో పత్తి, సోయా, కందులు, మొక్క జొన్న, పెసర, మినుము తదితర విత్తనాలు విత్తుతున్నారు.

కంగ్టి(నారాయణఖేడ్):

క్లుప్తంగా

గడువు ముగిసిన చిప్స్ ప్యాకెట్లు విక్రయం

- పిల్లల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కొమురవెల్లి(సిద్దిపేట): ధనార్జనే ధ్యేయంగా మండలంలోని కొందరు వ్యాపారులు గడువు ముగిసిన చిప్స్ ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ విక్రయాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం మండలంలోని గౌరయపల్లిలో పలువురు చిన్నారులు గ్రామంలోని ఓ కిరాణం షాపులో రూ.5 విలువ చేసే చిప్స్ ప్యాకెట్లు కొనుగోలు చేశారు. చిన్నారులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు చిప్స్ ప్యాకెట్ ఓపెన్ చేయమని ఇచ్చారు. వాటిపై ఎక్స్‌పైరీ డేట్ 2024 ఫిబ్రవరి 20గా ఉంది. దీంతో కంగుతున్న కుటుంబ సభ్యులు కాల పరిమితి ముగిసిన 4 నెలల తర్వాత విక్రయాలు జరుపుతున్నారని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయం మండల వ్యాప్తంగా వైరల్ అయ్యింది. ఇప్పటికైనా ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అల్లుడి మృతదేహం వద్ద రోదిస్తూ అత్త మృతి

చేగుంట(తూప్రాన్): అనారోగ్యంతో మృతి చెందిన అల్లుడి మృతదేహం వద్ద రోదిస్తూ గుండె పోటుతో అత్త మృతి చెందిన ఘటన మండలంలోని మక్కరాజిపేట గ్రామంలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మక్కరాజిపేట గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మంగళి నర్సింలు(50) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు నర్సింలు భార్య బాల్‌లక్ష్మి, అత్త నర్సమ్మ(68) మక్కరాజిపేటకు వచ్చి అల్లుడి మృతదేహం వద్ద రోదిస్తున్నారు. ఈ క్రమంలో నర్సమ్మకు గుండెపోటు వచ్చి మృతి చెందింది. అల్లుడు మృతి చెందిన గంటల వ్యవధిలోనే అత్తమ్మ సైతం మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

DOCUMENT LOST

I, Smt. R. VASANTHA, W/o R. BHASKAR GOUD, R/o House No.5-1, Deepthi Srinagar Colony, Madinaguda, Serilingampally, Near CBR Estates, Tirumalagiri, Hyderabad, Miyapur, T.S.-500049 Submit that I Lost my Original Certificates of Plot Document bearing Number 1389/1988, At SRO Sadasivpet while I was going on private vehicle on 11 June 2024. If anyone found Please Call: 9390827787

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client namely **Mothala Sunitha** W/o. M. Malla Reddy had intending purchase the agricultural Land admeasuring Ac. 2-26 gts in Survey No. 315/A, situated at Paidigummala Village, Kohir Mandal, Sangareddy District from Mohd. Babu Miya S/o. Qasim Ali, Land admeasuring Ac. 2-27 gts in Survey No. 315/A2, situated at Paidigummala Village, Kohir Mandal, Sangareddy District from Mohd. Moizuddin S/o. Khasim Ali and Land admeasuring Ac. 0-28 gts in Survey No. 315/AA/1, situated at Paidigummala Village, Kohir Mandal, Sangareddy District from Katikya Wajeed S/o. Mohammed Bandeli and paid part payment as advance sale consideration.

If, any person/persons are having any right, claim, title or interest over the above said agricultural lands, may approach the undersigned along with their relevant material documents in original in respect of their claim within seven (7) days from the date of this publication. Thereafter if any, claims received will not be entertained and such claims will not binding on my client and further my client shall proceed to complete the said sale transaction.

M/s. B. ROOPENDER
Advocate
Off: Plot No. 18, H No. 8-7-51, Phase-II, Hasthinapuram Central, Hyderabad - 500079.
Cell : 98482 62211

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639664 / 8977639665 [H-799891]

LOST

■ బూట్ల సంతోష్, తండ్రి: బూట్ల యాదగిరి అను నేను సిద్దిపేట జిల్లా, అక్కన్నపేట మండలం, గోవర్ధనగిరి గ్రామానికి చెందినవాడను. నా యొక్క ఒరిజినల్ డిగ్రీ బీటెక్ మెమో (OD), H.T.No: 09861A0414 గల మెమో, మా ఇంటి నుంచి అక్కన్నపేట తహసీల్దార్ ఆఫీసుకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో పడిపోయినది. మెమో అప్పగించిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సెల్: 8106434192. [K- 1187420]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185219]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విత్తే కీలకం



పత్తి యాంత్రిక సాగు పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఎంపిక, సమయంపై జాగ్రత్తలు తప్పనిసరి

- గడువు దాటి విత్తితే దిగుబడి పై ప్రభావం
- అనుకూల వర్షాలు కురిస్తే మరో నెల వరకు పత్తి వేయొచ్చు
- ఆగస్టు 15 వరకు వరి నాట్లు పూర్తి చేయాలి
- వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పల్లవి



పల్లవి, వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త

రైతులు ఆశించిన దిగుబడులు సాధించాలంటే సాగులో విత్తనాలు విత్తే సమయం అత్యంత కీలకమని ఏరువాక వ్యవసాయ పరిశోధన సంస్థ తొర్నాల శాస్త్రవేత్త పల్లవి సూచించారు. వానాకాలం సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు పొలం బాట పడుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు వరి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. సాగులో అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, చేపట్టాల్సిన విధి విధానాలు ఆమె మాటల్లో..

– దుబ్బాకటౌన్

పత్తి, వరి, పప్పుధాన్యాలు, కంది, మొక్కజొన్న పంటల పై రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి యాంత్రిక సాగుపై వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ కేంద్రం అధికారుల అంచనా ప్రకారం ఈసారి సాధారణ వర్షాపాతమే నమోదయ్యే అవకాశం ఉంది. కావున రైతులందరూ పరిస్థితులకనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు సాధించొచ్చని చెబుతున్నారు.

వరి: వరి సాగు చేసే రైతులు దీర్ఘకాల రకాలను ఈ నెల 25 వరకు నారు పోసుకోవాలి. మధ్య కాలిక రకాలు అయితే జూలై 10వ తేదీ వరకు నారు పోసుకోవచ్చు. జూలై 31 వరకు స్వల్ప కాలిక రకాల నార్లు పోసేందుకు సమయం ఉంది. ఆగస్టు 15వ తేదీ వరకు అన్ని రకాల వరి నాట్లను పూర్తి చేయాలి. నార్లు పోసే సమయంలో విత్తనాలను తప్పకుండా శుద్ధి చేయాలి.



దొడ్డు రకాలు: కూనరం సన్నాలు, బతుకమ్మ, కాటన్ దొర రకాల పంట కాలం 120 రోజులు కాగా ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక సన్న రకాలు: సాంబమసూరి పంట కాలం 150 రోజులు, ఎకరాకు 28 క్వింటాళ్లు, జై శ్రీరామ్ రకం పంట కాలం 145 నుంచి 150 రోజులు, ఎకరానికి 24 క్వింటాళ్ల దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.



పత్తి: అనుకున్నట్లు వర్షాలు కురిస్తే జూలై 15 వరకు పత్తి విత్తనాలను విత్తుకోవచ్చు. విత్తడంలో ఆలస్యం చేస్తే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. పత్తి సాగు చేసే రైతులు పంట మార్పిడి విధానం పాటించాలి. పెసర, అంతర పంటలుగా వేసుకుంటే మంచిది. ప్రభుత్వం అనుమతిచ్చిన సుమారు 20 సంస్థలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాలను మాత్రమే విత్తుకోవాలి. ఎకరానికి సాగు చేసే భూమిని బట్టి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పంటను డిసెంబర్ నెల వరకు తీసివేయాలి. రెండవ పంటగా మొక్కజొన్న, పెసర, కూరగాయాలు, పొద్దుతిరుగుడు పంటలను వేసుకుంటే మేలు. పత్తి విత్తనాలను విత్తిన రెండు రోజుల తర్వాత పెంటమిథిలిన్ 30 శాతం ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో లీటర్ ద్రావణాన్ని కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయడం వల్ల కలుపును నివారించవచ్చు.

మొక్కజొన్న: జూలై 15వ తేదీ వరకు మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. మార్కెట్‌లో లభించే హైబ్రీడ్ రకాల్లో సాగు భూమికి అనుకూలమైనవి ఎంపిక చేసుకోవాలి. మొక్కజొన్నను ఒక పంటగా కాకుండా కందితో కలిపి అంతర పంటగా వేసుకుంటే మంచిది.

కంది సాగులో విత్తన ఎంపిక..

- రైతులకు అందుబాటులో పలు రకాల విత్తనాలు
- సాగుకు ఎర్ర, చలక, రేగడి నేలలు అనుకూలం
- డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త రమేశ్





డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో వానాకాలంలో సుమారు 70 వేల ఎకరాల్లో కందిపంట సాగయ్యే అవకాశం ఉంది. పంటను సాగు చేసేందుకు రైతులు సమాయాత్తం అవుతున్నారు. కంది పంటను జూన్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు సాగు చేసుకోవచ్చని, రైతులు అనువైన రకాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలని జహీరాబాద్‌లోని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేశ్ తెలిపారు. అనువైన పలు రకాల విత్తనాలు మార్కెట్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నేలలను బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. విత్తనాలను వేసుకునే ముందు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలి.

నేలలు: కంది పంట సాగుకు ఎర్ర, చల్కనేలలతో పాటు రేగడి, మురుగు నీరుపోయే వసతి గల నేలలు సాగుకు అనుకూలమైనవి.

పంట కాలం: కంది పంటను ఖరీఫ్ మరియు రబీ కాలాల్లోనూ పండించుకోవచ్చు. వానాకాలంలో రకాన్ని బట్టి 150 నుంచి 180 రోజులు, రబీలో 130నుంచి 140 రోజుల పంట కాలం కలిగి ఉంటుంది.

విత్తన రకాలు

డీడీఆర్‌జీ-5 (హనుమ): వానాకాలంలో 160 నుంచి 180 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరానికి 8–10 క్వింటాళ్ల మేర దిగుబడి ఇస్తుంది. ఈ రకం విత్తనం ఫ్యూజేరియం ఎండు తెగులును తట్టుకుంటుంది. వంధత్వ మొజాయిక్ వైరస్ తెగుళ్లను కొంత వరకు, శనగ పచ్చ పురుగును తట్టుకుంటుంది.

అనుకూలమైన సమయం

వానాకాలంలో జూన్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు సాగుచేసుకోవచ్చు. ఆగస్టు 15 వరకు అయితే మొక్కలను పెంచుకొని దగ్గర అచ్చులో వేసుకోవచ్చు. రబీలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది.

ఐసీపీహెచ్–2740(మన్నెకొండకంది): వానాకాలంలో 170 నుంచి 190 రోజుల్లో చేతికి అందివస్తుంది. 8 నుంచి 10 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. పీజేటీఎస్‌ఏయూ మరియు ఇక్రిసాట్ సంయుక్తంగా రూపొందించిన మొట్ట మొదటి సీజీఎంఎస్ హైబ్రీడ్ విత్తనం. ఫ్యూజేరియం ఎండు తెగుళ్లు, వంధత్వ మొజాయిక్ వైరస్ తెగుళ్లను కొంతమేర తట్టుకుంటుంది. కాయలు రాలే గుణం చాలా తక్కువ.

డబ్ల్యూఆర్‌జీఈ–93 (తెలంగాణ కంది–1): పంట 155 నుంచి 165 రోజుల్లో కోతకు వస్తుంది. 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది.

టీడీఆర్‌జీ–59(తెలంగాణ కంది–3): 170 నుంచి 175 రోజులకు కోతకు వస్తుంది. 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఫ్యూజేరియం ఎండు తెగుళ్లను, మొజాయిక్ వైరస్ తెగుళ్లను తట్టుకుంటుంది. అధిక దిగుబడిని ఇచ్చే రకం.

ఆర్‌జీటీ–1(తాండూర్ తెల్లకంది రకం): 145 నుంచి 155 రోజుల్లో పంట చేతికి వస్తుంది. 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. ఫ్యూజేరియం ఎండు తెగుళ్లను తట్టుకుంటుంది.

కుంట కాల్వ కబ్జా



కాల్వలో మట్టి పోసిన దృశ్యం

తూప్రాన్: భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటల కాల్వలను అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సమీప రైతులకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కిష్టాపూర్– వెంకటాయిపల్లి గ్రామాల మధ్య వెంకటాయిపల్లి పెద్ద చెరువు నిండిన అనంతరం మత్తడి నుంచి కిష్టాపూర్ గ్రామ సమీపంలోని తుర్కకుంటకు కాల్వ ద్వారా నీరు వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి పెద్దచెరువులోకి నీరు చేరుతుంది. కాగా తుర్కకుంటకు వచ్చే కాల్వను కొందరు వ్యక్తులు పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టిని పోసి పూడ్చారు. దీంతో భారీ వర్షం పడితే పైనుంచి వచ్చిన వర్షపు నీటితో పాటు మట్టి సమీప వ్యవసాయ పొలాల్లోకి వచ్చి చేరుతుందని రైతులు వాపోతున్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా కాల్వ పూడిక పనులు చేసిన విషయం రైతులు గుర్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో ఇరిగేషన్ ఏఈ అనురాధను ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

కొండపాక(గజ్వేల్): పిడుగుపాటుకు గిరిజాతి ఆవులు మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ శివారులో సేవ్ నేచర్ ఫౌండేషన్‌లో పని చేస్తున్న వీర భద్రయ్య, బాలరాజులు ఆదివారం రాత్రి చెట్టు నీడలో ఆవులను కట్టేశారు. సోమవారం ఉదయం చూసేరికి రెండు ఆవులు మృతి చెంది ఉన్నాయి. గిరిజాతికి చెందిన ఆవులు కావడంతో వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

మాచాపూర్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగుపాటుకు గురై ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మాచాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రేగుల నారాయణ రోజు మాదిరిగా తన పశువులను పొలం వద్ద పాకలో కట్టేసి ఇంటికొచ్చాడు. అర్ధరాత్రి సమయంలో సమీపంలో పిడుగుపడి ఆవు మృతి చెందింది. సుమారు రూ.50 వేల విలువ ఉంటుందని బోరున విలపించాడు.



కొండపాక(గజ్వేల్): మృతి చెందిన ఆవులు

విద్యుదాఘాతంతో రెండు గేదెలు

హత్నూర(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన హత్నూర శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నీరుడి నర్సింహులు రెండు గేదెలు మేత కోసం గ్రామ శివారుకు వెళ్లాయి. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

స్కూటీని ఢీకొట్టిన లారీ

యువకుడి దుర్మరణం

ములుగు(గజ్వేల్): యాక్టీవా ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం ఒంటిమామిడి సమీప రాజీవ్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. సికింద్రాబాద్ నేరెడ్‌మెట్‌కు చెందిన ప్రకాశ్ ప్రణీత్‌కుమార్(25) తన స్నేహితుడి యాక్టీవా స్కూటీపై సోమవారం ఉదయం పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయల్దేరాడు. వంటిమామిడి సమీపంలోకి రాగానే ముందున్న కారును ఓవర్‌టేక్ చేస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రణీత్‌కుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుకాల కూర్చున్న సొంపల్లి అక్షయకు గాయాలయ్యాయి. మృతుడి తల్లి ప్రకాశ్ విజయకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యాన్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేర్యాల మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన నర్సింలు దుద్దెడ నుంచి తాడూర్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్న వ్యాన్‌ను మోటార్ అదుపు తప్పి ఢీకొట్టగా నర్సింలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా సిబ్బంది నర్సింలును సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన మనోజ్(26) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లోని జెన్ కేబుల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. మనోజ్ మద్యానికి బానిస కావడంతో ఆరు నెలల కిందట భార్య బేగం భర్తను వదిలి ముత్తంగి తేజ కాలనీలో ఉంటుంది. ఆదివారం రాత్రి కంపెనీకి సంబంధించిన ఓ స్థలంలో మామిడి చెట్టుకు మనోజ్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించిన కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీలో నివాసముండే వరికొప్పుల నవీన్(26)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. మద్యానికి బానిసైన నవీన్ కుటుంబ కలహాలతో సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు వచ్చిచూసే సరికి విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

టాస్కుల పేరుతో సైబర్ మోసం

రూ.1.31 లక్షలు పోగొట్టుకున్న బాధితులు



పటాన్ చెరు టౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ వ్యక్తి రూ. 82 వేలు, మరో వ్యక్తి రూ.49 వేలు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడీఎఫ్ కాలనీకి చెందిన ఓ డ్రైవర్‌కు ఏప్రిల్ 4వ తేదీన టాస్కులు పూర్తి చేస్తే, కమీషన్ ఇస్తామని వాట్సాప్‌కు లింకు రావడంతో దాన్ని క్లిక్ చేసి వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ. 82 వేలు వేశాడు. అనంతరం పెట్టిన నగదు తో పాటు, కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరొక ఘటనలో ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ మెడికల్ షాప్ నిర్వాహకుడికి ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తే నగదు రెట్టింపు ఇస్తామని లింక్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి, పలు దఫాలుగా రూ.49 వేలు వేశాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేతో అమ్మాయిలకు స్వీయరక్షణ



సర్టిఫికెట్లతో చిన్నారులు

సిద్దిపేటఎడ్యుకేషన్: కరాటేతో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఆరోగ్యం పెంపొందుతాయని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా దక్షిణ భారతదేశ చీఫ్ రాపోలు సుదర్శన్ అన్నారు. అసోసియేషన్ జోనల్ చీఫ్ రామిని భాగ్యరాజ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సహస్ర హైస్కూల్‌లో అంతర్జాతీయ కరాటే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరాటేతో రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. టీపీసీసీ సభ్యులు ధరిపల్లి చంద్రం మాట్లాడుతూ.. అమ్మాయిల స్వీయరక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 50 మంది చిన్నారులకు సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్, ప్రిన్సిపాల్ శాంతికిరణ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాచకొండ ఆంజనేయులు, బాధ్యులు సాయికిరణ్, రాజు, ఎల్లేశ్, ప్రవీణ్, సాత్విక్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

కూతుళ్లను సంపులో పడేసి.. తాను ఉరి వేసుకునే ప్రయత్నం

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ తన పిల్లలను సంపులో పడవేసి, తాను ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం గజ్వేల్ మండలం జాలిగామలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజుకు వడ్డేపల్లికి చెందిన మానసతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్ల మూడేళ్లలోపు అనన్య, ఏడాదిలోపు సహస్ర ఉన్నారు. రాజు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుటుంబంలో నెలకొన్న కలహాల కారణంగా మానస ఇద్దరు పిల్లలను చున్నీతో కట్టి ఇంటి సమీపంలో ఉన్న నీటి సంపులో పడేసింది. అనంతరం తాను ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి విరమించుకుంది. తిరిగి సంపు వద్దకు చేరుకొని పిల్లలను బయటకు తీసి రోదిస్తున్న క్రమంలో ఇరుగుపొరుగు గమనించి భర్త రాజుకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గజ్వేల్ సీఐ సైదా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు.

బతుకుదెరువు కోసం వచ్చి.. మృత్యుఒడిలోకి

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- అక్కడికక్కడే యువకుడు మృతి



పాండరి (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని అన్నసాగర్ వద్ద నాందేడ్– అకోలా జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం కేమ్రాజ్ కల్లాలి గ్రామానికి చెందిన బట్టవార్ పాండరి (22) బతుకుదెరువు కోసం ఇటీవలె అందోలు మండల పరిధిలోని కిచ్చన్నపల్లికి వచ్చి ఓ వ్యవసాయ క్షేత్రంలో కూలీ పని చేస్తున్నాడు. పాండరి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఓ పని నిమిత్తం జోగిపేటకు వచ్చి తిరిగి కిచ్చన్నపల్లికి వెళ్తున్నాడు. నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జోగిపేట వైపు వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రాములు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల ఎరువుకు డిమాండ్

ఆసక్తి చూపుతున్న రైతులు

- ఖర్చు పెరిగినా.. పంట దిగుబడి వస్తుందని ఆశలు
- ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.12 వేల పైమాటే
- తగ్గుముఖం పట్టిన రసాయన ఎరువులు



పొలంలో వేసిన పశువుల ఎరువు

చిన్నకోడూరు(సిద్దిపేట): పంట ఎదుగుదలకు రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువులను వాడేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువు వాడటం వల్ల ఆరోగ్యకరమైన పంటలు, భూసారానికి ఎలాంటి హాని ఉండదని ఎక్కువ పెట్టుబడి పెట్టి పశువుల ఎరువును పంట చేనులో చల్లుతున్నారు. పంటలకు రసాయనాలు, క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి వాడొద్దంటూ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులు ఈ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం దీని ధర ట్రిప్పుకు రూ. 12 వేలకు పైబడి పలుకుతుంది.

ఎరువుతో లాభాలు

గతంలో వ్యవసాయ దారులు ప్రత్యేకంగా పశువుల పేడను ఒక చోట నిల్వ ఉంచేవారు. ఏడాది తర్వాత ఆ పశువుల పేడ సేంద్రియ ఎరువుగా మారేది. దీన్నే పంట పొలాల్లో వేయడం వల్ల సత్ఫలితాలు సాధించేవారు. అన్ని నేలలకు పశువుల పేడ అనుకూలంగా ఉంటుంది. ఈ ఎరువు ద్వారా వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. నేలలో నీటి నిల్వ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందుబాటులో ఉండేలా ఈ ఎరువు ఎంతో ఉపయోగపడుతుంది. అయితే పశువుల ఎరువులను ఒక్కసారి వాడితే 2 నుంచి 3 పంటలకు భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ ఎరువుతో మేలు..



రైతులు అందుబాటులో ఉంటే పశువుల ఎరువును పొలాల్లో వాడాలి. ఏ నేలకైనా ఈ ఎరువు ఎంతో లాభం. గతంలో ఈ ఎరువులనే వాడేవారు. దీంతో పండించిన పంటకు దిగుబడి పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల ఎరువుతో ఎంతో మేలు జరుగుతుంది.

– జయంత్ కుమార్, ఏఓ